క్లుప్తంగా

నూతన వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ విజయానికి కృషి చేసిన మండల పరిధిలోని బందర్లపల్లి గ్రామానికి చెందిన నూతన వరుడు నరేష్ దంపతుల వివాహానికి రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట కిషోర్‌రెడ్డి, రుక్మాంగధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోండి


ఎక్సైజ్ సీఐ శిరీషాదేవి

కార్వేటినగరం: నూతన మద్యం షాపులకు ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ శిరీషాదేవీ తెలిపారు. ఆదివారం ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నూతన మద్యం షాపులకు దరఖాస్తులు చేసుకునే వారు కార్వేటినగరం-3, శ్రీరంగరాజపురం -2, వెదురుకుప్పం-2, పాలసముద్రం-1 షాపులకు 9వ తేదీ సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 11వ తేదీ ఉదయం 8 గంటలకు చిత్తూరు కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ కల్యాణ మండపం ఆవరణలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా మద్యం షాపుల టెండర్లు ప్రారంభిస్తారని చెప్పారు. లాటరీలో షాపులు పొందిన వారు అదే రోజు మొత్తం నగదును చెల్లించి 12వ తేదీ నుంచి షాపులు ప్రారంభించుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు httpr://hpfrpsoject.com లేదా 04042425520 నంబరును సంప్రదించాలని తెలిపారు.

ముస్లింలు ఐక్యంగా ఉండాలి


ముస్లింల ర్యాలీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): అన్ని రంగాల్లో ముస్లిం సమాజం అభివృద్ధి చెందాలంటే ఐక్యంగా పోరాడాలని ముస్లిం ఐక్యవేదిక నాయకులు చిత్తూరు నగరంలో కదం తొక్కారు. ఆదివారం ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం నగరంలోని ఉర్దూ షాదీఖానాలో ముస్లిం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్‌వలి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ముక్కలుగా ఉన్న ముస్లిం సమాజాన్ని ఒక్కటి చేస్తూ, రాజకీయ పార్టీలకు, జమాతులకు అతీతంగా ముస్లిం ఐక్యవేదిక పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధికార ప్రతి నిధి ఖలీల్ సయ్యద్, సెక్రటరీ సయ్యద్ నూర్, ఉపాధ్యక్షుడు రషీద్, జిల్లా కార్యదర్శి ఇనయతుల్లా, తిరుపతి జిల్లా అధ్యక్షుడు నిజాముద్దీన్ పాల్గొన్నారు.

పచ్చచొక్కాలకే ఉపాధి

- రూ.99.40 లక్షల పనులు మంజూరు
- ఉపాధి నిధులపై టీడీపీ పెత్తనం
- ప్రజాప్రతినిధుల తీర్మానాలు లేకుండానే ప్రతిపాదనలు
- రాజకీయ ఒత్తిడి భరించలేక అధికారుల ఆమోదం
- సర్పంచుల వ్యవస్థ నిర్వీర్యం


పీఆర్ ఏఈని నిలదీస్తున్న పన్నూరు సర్పంచ్ (ఫైల్)

సాక్షి నెట్‌వర్క్: టీడీపీ నేతల బరితెగింపునకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. తమ పార్టీకి ఓటు వేయలేదన్న కక్షతో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు, డ్వాక్రాలో సంఘమిత్రలు, అంగన్‌వాడీ టీచర్లను తొలగించాలంటూ అధికారులపై ఒత్తిడి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తమ పార్టీ అధికారంలో ఉందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అడ్డు చెప్పేవారు ఎవరూ లేరన్న ధోరణిలో గ్రామీణ పచ్చతమ్ముళ్లు అనధికార పాలనకు తెరతీశారు. తాజాగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అభివృద్ధి పనులు(సీసీ రోడ్లు, డ్రైన్లు) చేపట్టేందుకు ఇప్పటి వరకు రూ.99.40 లక్షలు విలువ చేసే పనులు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో తీర్మానాలు ప్రభుత్వానికి పంపాల్సి ఉంటుంది. మండలంలో మెజారిటీ గ్రామ పంచాయతీల్లో వైఎస్సార్ సీపీకి చెందిన సర్పంచులు ఉన్న కారణంగా తమ్ముళ్ల పప్పులు ఉడకని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే పలు గ్రామాల్లో బెదిరింపులకు పాల్పడి గ్రామ పంచాయతీ తీర్మానాలు చేస్తున్నారు. మరి కొన్నింటిలో తెలుగుదేశం పార్టీకి చెందిన చోటామోటా నేతలు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తీసుకువచ్చి సర్పంచుల ప్రమేయం లేకుండానే తీర్మానాలు చేస్తున్నారు. మరి కొన్ని ప్రాంతాల్లో కొందరు అధికారులే సర్పంచులతో రాయబారాలు నడిపి సమస్య ఉత్పన్నం కాకుండా పరిస్థితిని చక్కబెడుతున్నారు. ఏదేమైనా గ్రామాల్లో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులను పరిగణనలోకి తీసుకోకుండా, తమ ఇష్టారాజ్యంగా తమ్ముళ్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి. ఆయా పనుల్లో రాజకీయ జోక్యం అధికం కావడంతో అధికారులు కూడా పట్టపట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ మద్దతుదారులే సర్పంచులు

విజయపురం మండలంలో 2021లో 25 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించగా అందులో 22 గ్రామాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులే విజయం సాధించారు. మెజారిటీ పంచాయతీలన్నీ వారి ఏలుబడిలోనే ఉన్నందున గ్రామ పంచాయతీ తీర్మానాల కోసం తీవ్రస్థాయిలో ఒత్తిడిని పెంచుతున్నారు. గ్రామాభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే ప్రజావసరాలను గుర్తించి పనులు చేపడితే బాగుంటుందనే అభిప్రాయాన్ని పలువురు సర్పంచులు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పలు ప్రాంతాల్లోని టీడీపీ నేతలు పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తీసుకువస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

'తెలుగుదేశం పార్టీకి చెందిన నేతలు గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండానే అధికార బలంతో కేవలం కార్యదర్శి తీర్మానం తీసుకొని గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభిస్తున్నారు. సర్పంచ్ సంతకం, తీర్మానం లేకుండా పనులు మంజూరు చేయడం చట్ట విరుద్ధం. ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులకు వెండర్ కోడ్ ఉన్నవారి మీద బిల్లులు చేసుకోవాలని చూస్తున్నారు. ఇలాగే కొనసాగితే సర్పంచుల వ్యవస్థ నిర్వీర్యం అవుతుంది' అని సర్పంచ్ సంఘాలు అంటున్నారు.

'గ్రామ పంచాయతీ తీర్మానాలు చేసిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపి పనులు మంజూరు వేయించుకుంటున్నారు. ఈ పనులకు మండల పరిషత్ తీర్మానం అవసరం లేదా? జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద విజయపురం మండలానికి కోట్ల విలువైన పనులు మంజూరయ్యాయి. ఈ పనులను మండల పరిషత్ తీర్మానం లేకుండా ఎలా మంజూరు చేస్తారు' అంటూ విజయపురం వైస్ ఎంపీపీ బాలాజీతో పాటు 20 మంది సర్పంచులు, ఎంపీటీసీలు ఇటీవల పీఆర్ ఎస్ఈని ప్రశ్నించారు. అలాగే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

షాడో ఎమ్మెల్యే చేతిలో అధికారులు

నగరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఒకరైతే..అన్నీ తానై వ్యవహరిస్తున్న షాడో ఎమ్మెల్యే మరొకరు. ఆ షాడో ఎమ్మెల్యే చేతుల్లో అధికారులు కీలుబొమ్మగా మారారు. ఇక్కడ ఏమి జరగాలన్నా... ఎవ్వర్ని మార్చాలన్న, ఉపాధి హామీ పనులు చేయాలన్నా... చివరికీ కూటమి పార్టీ నాయకులైనా ఆయన చెప్పినట్టే నడుచుకోవాలి. లేకుంటే బెదిరింపులు తప్పవు. ప్రస్తుతం మంజూరైన ఉపాధి హామీ పనులు కూడా ఆ షాడో ఎమ్మెల్యే చెప్పిన నాయకులకే కట్టబెట్టాడన్న వాదన గట్టిగా వినిపిస్తున్నాయి.


విజయపురం ఎంపీడీవో కార్యాలయం

రొబోటిక్ లీగ్‌లో పన్నూరు విద్యార్థుల ప్రతిభ


రొబోటిక్ లీగ్ సీజన్-3లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

విజయపురం: చిత్తూరు జిల్లా, విజయపురం మండలం, పన్నూరు సబ్‌స్టేషన్ రెయిన్‌బో పాఠశాల విద్యార్థులు తమిళనాడు రాష్ట్రం, తిరుచ్చిలో జరిగిన రొబోటిక్ లీగ్ సీజన్-3లో తమ ప్రతిభ చాటారు. తమిళనాడు, తిరుచ్చిలో శనివారం రాత్రి రొబోటిక్ లీగ్ అసోసియేషన్ వారు అతిపెద్ద రొబోటిక్ పోటీలు నిర్వహించారు. ఈ రొబోటిక్ పోటీలో ఆంధ్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడులోని 350 పాఠశాలకు చెందిన 5వేల మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పన్నూరు సబ్‌స్టేషన్‌లో రెయిన్‌బో పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు 5 ఈవెంట్లలో పాల్గొని అన్నింటిలో ప్రథమ బహుమతి సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రాజు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్, విజయపురం వైస్ ఎంపీపీ మంజు బాలాజీ, ప్రిన్సిపల్ సి.ప్రసన్నకుమార్ విద్యార్థులను అభినందించారు.

సమగ్ర శిక్ష సిబ్బందికి జీతాలు చెల్లించండి

బంగారుపాళెం: సమగ్ర శిక్ష సిబ్బందికి జీతాలు చెల్లించాలని జిల్లా సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ జేఏసీ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. విద్యాశాఖకు సంబంధించి సమగ్ర శిక్ష విభాగం కింద పనిచేస్తున్న ఎంఐఎస్, డేటా ఎంట్రీ, సీఆర్ఎంటీ, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, మెసెంజర్స్, ఐఆర్‌పీలు, డీపీఓ ఆఫీస్ సిబ్బంది, కేజీబీవీ టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి గత రెండు నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటికైనా జీతాలు చెల్లించాలని కోరారు.

ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులు



గురువులను సన్మానిస్తున్న డైట్ పూర్వవిద్యార్థులు, కార్యక్రమానికి హాజరైన పూర్వ విద్యార్థులు

కార్వేటినగరం: ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులని డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ చంద్రశేఖర్ అన్నారు. జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) కార్వేటినగరంలో 1982-83 పూర్వ శిక్షణా ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మూడు దశాబ్దాల అనంతరం ఒక్కచోట కలుసుకున్న పూర్వ విద్యార్థుల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. అనంతరం ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్రాంత ప్రిన్సిపల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎందరో ఛాత్రోపాధ్యాయులను ఉపాధ్యాయులుగా మార్చిన ఘనత కార్వేటినగరం జిల్లా విద్యాశిక్షణా సంస్థకు మాత్రమే ఉందన్నారు. అధ్యాపకుడు సురేష్‌బాబు దంపతులను పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి, గజమాలలతో ఘనంగా సన్మానించారు. 1982-83 సంవత్సరంలో ఛాత్రోపాధ్యాయులుగా శిక్షణ పొంది అనారోగ్యంతో మృతి చెందిన పలువురికి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే ఇటీవల పదవీవి రమణ పొందిన 10 మంది పూర్వ విద్యార్థులను సన్మానించారు. ఉమాశంకర్, శాంతకుమారి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా నాగరాజ


సర్టిఫికెట్ అందుకుంటున్న నాగరాజ

ఐరాల: మండలంలోని చెంగనపల్లెకు చెందిన ఏఆర్ నాగరాజ వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా అధికారిక గుర్తింపు సంపాదించారు. చిత్తూరు ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంటెక్ పూర్తి చేసి, ప్రస్తుతం బెంగళూరులో ఓ సొంత ప్రైవేట్ కంపెనీ అధినేతగా ఉన్నారు. ఇటీవల ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని పూర్తి చేసి ఆ సంస్థ అధినేత గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా వ్యక్తిత్వ వికాస శిక్షకుడిగా ధ్రువపత్రం అందుకున్నారు. తాను ఉచితంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లోని విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన


చికిత్సకు బారులు తీరిన జనం


చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

నగరి: బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం పెళ్లకూరుకు చెందిన చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి శ్రీవెంకటేశ్వర అరవింద నేత్రాలయం వారు ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించిన ఈ శిబిరంలో వైద్య నిపుణులు వంశీకృష్ణ, భావన వైద్య సేవలు అందించారు. 200 మంది హాజరై కంటి వైద్యపరీక్షలు చేసుకోగా వారిలో 40 మందికి ఉచిత ఆపరేషన్లు చేయనున్నట్లు వైద్యసిబ్బంది తెలిపారు. 50 మందికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఈవో సీతారామనాయుడు, ఏవోలు కృష్ణగల్లా, అరవింద నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాయమవుతున్న ఇసుక డంప్



సగమే మిగిలి ఉన్న సీజ్ చేసిన ఇసుక కుప్ప

పాలసముద్రం: పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక డంప్ మాయమైపోతోంది. తమిళనాడుకి తరలించేందుకు సరిహద్దులో ఉన్న అక్రమ ఇసుక డంపులను కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఆదేశాల మేరకు ఎస్ఐ భారతి తమ సిబ్బందితో ఇటీవల స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. దీంతో టీడీపీ నాయకులు సీజ్ చేసిన ఇసుకపై కన్నేశారు. తమిళనాడులో ఇసుకకు మంచి గిరాకీ ఉంది. సీజ్ చేసిన ఇసుక రోజు రోజుకి కుప్పల నుండి సగం సగం మాయమై పోతోంది. క్రిష్ణజమ్మపురం సమీపంలో సీజ్ చేసిన ఇసుకను రాత్రికి రాత్రి జేసీబీతో తమిళనాడుకి తరలించారు. వనదుర్గాపురంలో టీడీపీ బడా నాయకుడు పోలీసులను బెదిరించి, ఇసుకను తమిళనాడుకి తరలిస్తున్నాడు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు, పోలీసులు ఉన్న ఇసుకను వేలంపాట వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాగే వదిలేస్తే సీజ్ చేసిన ఇసుక కుప్పలు మొత్తం మాయం కానున్నాయి.

బహురూపం... దివ్యతేజం

అన్నపూర్ణగా దేశమ్మ దేవత, మహేశ్వరిగా కామాక్షిదేవి, అన్నపూర్ణ దేవిగా అమ్మవారు, పుత్తూరు: దుర్గాదేవిగా ఆరేటమ్మ, పుత్తూరు: గాయత్రిదేవిగా కన్యకాపరమేశ్వరి, ఓంశక్తి ఆలయంలో వస్త్రదానం





నగరి: నియోజకవర్గంలోని దేవీ ఆలయాల్లో ఆదివారం నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. నేత్రప్రదాయిని దేశమ్మ దేవత అన్నపూర్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. పట్టణ పరిధిలోని కరకంఠేశ్వరాలయంలో నవరాత్రి పూజల్లో భాగంగా దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షి దేవికి మహేశ్వరి అలంకరణ చేయగా భక్తులను అమితంగా ఆకట్టుకుంది. అర్చకులు దుర్గాప్రకాష్ మంత్రోచ్చారణ నడుమ బ్రాహ్మణ సంఘ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కుంకుమ అర్చన చేశారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు. మండలంలో టీటీడీ ఆధీనంలోని బుగ్గఅగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవి సన్నిధిలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి మహాశక్తి అలంకారం చేశారు. అమ్మవారిని ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గుణశేఖర్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. పట్టణ పరిధి సత్రం దక్షిణ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నవరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు, మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్థానిక ఓంశక్తి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అమ్మవారి చిత్రపటానికి ప్రత్యేక అలంకరణ చేశారు. త్రిశూలాన్ని ఓంకార రూపిణిగా అలంకరించారు. భక్తులకు అన్నదానం, వస్త్రదానం చేశారు.

గాయత్రి దేవిగా అల్లిఎల్లమ్మ

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన శ్రీ అల్లి ఎల్లమ్మ తల్లి దేవస్థానంలో దసరా మహోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం గాయత్రి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉదయం మూలవిరాట్ అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో ఆలయ అర్చకులు ఆనందస్వామి ఆధ్వర్యంలో జీడీ నెల్లూరు గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రసన్న కుటుంబ సభ్యుల ఉభయదారులుగా వ్యవహరించారు. దాదాపు 500 మందికి సుమంత్ రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు పార్థసారధిరెడ్డి, నిర్వాహకులు గుణశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగలో వెలసిన చెవిటి గంగమ్మకు, తమిళనాడు సరిహద్దులో నొచ్చిలి గ్రామంలో వెలసిన గిరిరాజ కన్యకా పరమేశ్వరీ సమేత గంగాధరేశ్వర స్వామి ఆలయాల్లో నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. గిరిరాజ కన్యకా పరమేశ్వరి అమ్మవార్లను శాకాంబరిదేవి అలంకారంతో, మిద్దినత్తం గ్రామంలో వెలసిన పడవేటమ్మ పరమేశ్వరీ సమేత గంగాదేవిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. చెవిటి గంగమ్మతల్లిని వివిధ సంగంధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

అన్నపూర్ణ దేవిగా మహాలక్ష్మి అమ్మవారు

నిండ్ర: మండలంలోని కేఆర్ పాళెం గ్రామంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నపూర్ణా దేవి అవతారంలో దర్శన మిచ్చారు. అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయం ఆవరణలో ఉన్న రాజరాజేశ్వరి దేవి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం లలిత త్రిపుర దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆలయంలో భక్తిప్రపత్తులతో అభిషేకాలు చేశారు. అనంతరం పట్టు పీతాంబరాలు వెండి తొడుగులతో కూడిన ఆభరణాలతో అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు ప్రసాదాలు పంచి పెట్టారు.

పుత్తూరులో..

పుత్తూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం గ్రామదేవత ఆరేటమ్మ దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆరేటమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కె.మనోహర్ రెడ్డి, వాణి, జగన్నాథరెడ్డి, ఉదయశ్రీ, ఉమాశంకర్‌రెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

వడమాలపేటలో..

స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, అగ్ని హోమం, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్ర నామార్చనలతో కుంకుమ పూజలు నిర్వహించారు. పూడి క్రాస్ వద్ద అంకాలమ్మ ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని లలిత త్రిపుర సుందరిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం శ్రీబంగారమ్మ అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులైన ధనుంజయవర్మ, మునిరామరాజు కుటుంబ సభ్యులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ నేపథ్యంలో భక్తులకు అధిక సంఖ్యలో తరలి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అధ్యక్షుడు కె.ప్రసాద్, ఉపాధ్యక్షుడు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

మండల పరిధిలోని ఆలత్తూరు గ్రామ సమీపంలో వెలసి ఉన్న శ్రీముత్యాలమ్మ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అదే విధంగా మండల కేంద్రంలో వెలసి ఉన్న శ్రీ ద్రౌపదీ ఆలయంలో కూడా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి పట్టు వస్త్ర సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు.








గాయత్రీ దేవిగా అల్లిఎల్లమ్మ తల్లి, ఉత్సవ మూర్తి, శాకాంబరిదేవిగా గిరిరాజ కన్యకా పరమేశ్వరి, అన్నపూర్ణగా గంగాదేవి, చెవిటిగంగమ్మతల్లి ఊరేగింపు, రాజరాజేశ్వరి అమ్మవారు, అన్నపూర్ణాదేవి అలంకరణలో శ్రీబంగారమ్మ